# భూమి సూర్యుడిచుట్టూ తిరుగుతుంది

డబ్బున్న వాళ్ళ కోపంలా బయట ఎండ మండిపోతూ ఉంది. మంచివాళ్ళ సహనంలా ఆ ఆఫీసు ఆవరణలో ఉన్నచెట్లు నీడ నిస్తున్నాయి. ఆ చల్లదనాన్ని అనుభవిస్తూ ఒక చెట్టునీడన నిలుచుని ఉన్నాడు రాజయ్య.

వయసు అరవై అయిదేళ్ళుంటాయి. బాధలు, విచారం కలగాపులగంగా కలిసినట్లు ముఖంమీద మడతలు పడి ఉన్నాయి. శరీరం ఎండిపోయి బలహీనంగా ఉంది. ఈ మధ్యనే పక్షపాతం వచ్చి తగ్గినదానికి గుర్తుగా చేతిలో కర్ర ఉంది.

ఆయన ఒకప్పుడు బాగా బ్రతికినవాడే. ఒకప్పుడు ఆ ఆఫీసును రాజులా ఏలాడు. ఆఫీసుస్టాఫు అతని అడుగులకు మడుగు లొత్తేవారు. తరువాత రిటైరయ్యాడు. రిటైరయిన తరువాతనే అతనికి అన్ని బాధలూ ఎదురయ్యాయి. బంధువులు అతని ఆస్తిని మోసంతో కాజేశారు. ఆ ఆస్తిని తిరిగి చేజిక్కించుకొనేసరికి అంత విలువయిన డబ్బూ ఖర్చయింది.

దూరంగా ఉద్యోగంలో ఉన్న ఒక్కగానొక్క కొడుకు, పెళ్ళికాగానే భార్యమాటలు విని డబ్బు పంపడం మానేశాడు. ఉద్యోగంలో ఉండగా పెద్దకుమార్తెను వైభవంగా వివాహం చేశాడు. రిటైరుమెంటు బెనిఫిట్సుతో రెండవ కుమార్తె వివాహం కూడా చేశాడు. ఇప్పుడు వివాహము కావలసిన ఆడపిల్లలు ఇద్దరున్నారు. పాపం ఆరునెలల క్రితం వచ్చిన పెరాలిసిస్ రాజయ్యకు పెద్దషాక్.

ఆయన రిటైరయిన వెంటనే రావలసిన జి.పి.ఎఫ్.ఎల్.ఐ సి.,

సరెండరు లీవు తదితర మొత్తాలు వెంటనే ఇచ్చేశారు. అంతా కలిపి డెబ్బైవేల వరకు వచ్చింది. కాని పెన్షను మాత్రం ఇప్పటికీ ఫిక్సుకాలేదు. ఎంతోమంది పై ఆఫీసర్లకు అర్జీలు ఇచ్చాడు. ఊహూఁ. పనికాలేదు.

తను ఈ ఆఫీసులోనే ఆఫీసరుగా రిటైరయ్యాడు. కనుక ఇక్కడే తన పెన్షను ఫిక్సుకావాలి. ఇక్కడనుంచి పెన్షను ప్రపోజల్స్ హెడ్ ఆఫీసుకు పోయి శాంక్షను అయి రావాలి. ఇంతకుముందున్న ఆఫీసర్లకు ఎంతోమందికి అర్జీలు ఇచ్చాడు. కాని ఒక్కరూ వాటిమీద సరియైన యాక్షన్ తీసుకోలేదు. ప్రస్తుతం కొత్తగా వచ్చిన ఆఫీసరు చాల మంచి వాడంటున్నారు అందరూ. అందుకే ఈరోజు తీరిక చేసుకొని మైలు దూరం నడిచి ఆఫీసు చేరుకొన్నాడు.

అతను ఆలోచనలలో ఉండగానే జీపు సర్రున వచ్చి ఆఫీసు ముందు ఆగింది. ఆఫీసరు జీపుదిగి లోపలికి వెళ్ళిపోయాడు.

రాజయ్య మెల్లగా కదిలి బలహీనమైన శరీరాన్ని ఈడ్చుకొంటూ ఆఫీసరు రూము ముందుకు చేరాడు. స్టూలుమీద కూర్చుని ఉన్న బంట్రోతు పరిచయపూర్వకంగా నవ్వాడు. అంతేగాని స్టూలుమీద నుంచి లేవలేదు.

రాజయ్య మనసు చివుక్కుమంది, తను ఉన్నప్పుడు పనిచేసిన అటెండర్లుగాని, స్టాఫుగాని ఇప్పుడు లేరు అంతా ట్రాన్స్ఫరై ఎక్కడెక్కడికో వెళ్ళిపోయారు. వాళ్ళేగాని ఉండి ఉంటే తనను మరీ ఇంత హీనంగా చూసేవాళ్ళు కాదు-అనుకొన్నాడు.

"లోపలికి వెళతారా?" అన్నాడు బంట్రోతు. పోనీలే ఏదో ఒకప్పుడు ఆఫీసర్‌గా పని చేసినవాడు కదా అన్న సానుభూతి ఉంది అతని గొంతులో.

"వెళతానయ్యా!" అన్నాడు రాజయ్య లోగొంతుకతో.

బంట్రోతు తలుపునెట్టి రాజయ్య లోపలికి వెళ్ళడానికి ప్రవేశం కలిగించాడు.

ఏదో రాసుకుంటున్న ఆఫీసర్ "నమస్కారం సార్!" అన్న రాజయ్య గొంతు విని తలెత్తకుండానే "ఏమిటి?" అని ప్రశ్నించాడు.

"అయ్యా! నేనిక్కడ ఆఫీసర్‌గా రిటైరై ఎనిమిదేళ్ళయింది. ఇప్పటివరకు నా పెన్షను ఫిక్సుకాలేదు. తిరిగి తిరిగి కాళ్ళరిగిపోయాయి. ఇక మీ టైములోనైనా నా పెన్షను ఫిక్సు అయితే నిశ్చింతగా బ్రతుకుతాను."

"మీరు రిటైరై ఎనిమిదేళ్ళయినా పెన్షను ఫిక్సు కాలేదా? అయామ్ వెరీ సారీ సార్. కూర్చోండి" అన్నాడు ఆఫీసర్ తలెత్తకుండానే

రాజయ్యకు ఆఫీసర్ మాటలు భగభగమండే నిప్పులమీద చన్నీళ్ళు చిలకరించినట్లయింది. ఇన్ని రోజులవరకు ఇంత నెమ్మదిగా, మర్యాదగా జవాబిచ్చిన ఆఫీసర్ ఒకరూలేరు. ఆఫీసర్ హోదా వచ్చేసరికి అందరికీ నెత్తిమీదికి కళ్ళు వచ్చేస్తాయి. కాని ఒకనాటికి వాళ్ళు రిటైరై పరిస్థితులు కలసి రాకపోతే తనలా తయారవుతారని. ఒక్కనాటికీ ఊహించరు. ఆఫీసర్ మంచితనానికి ముగ్ధుడై అతన్ని దేముడు చల్లగా చూడాలని మనస్ఫూర్తిగా దీవించాడు మనసులోనే. కాని ఆఫీసర్ చెప్పినట్లు ఆయన టేబులు కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చోలేదు రాజయ్య.

ఓ అరగంటవరకు వచ్చిన టపా చూస్తూ అందులో తీసుకోవాల్సిన యాక్షను గురించి డైరెక్షన్స్ నోట్ చేస్తున్న ఆఫీసర్ తలెత్తి ఎదురుగా చూశాడు కుర్చీలో ఎవరూ లేరు.

"అరె ఇందాకనే కూర్చోమన్నాగా" అంటూ తలెత్తి చూశాడు ఆఫీసర్.

అంతే! ఆఫీసర్ రామారావు షాక్ తిన్నాడు. చేతిలోని కలం టేబులుమీద పడిపోయింది ముఖం అసంకల్పితంగా జేగురురంగుకు మారిపోయింది. పిడికిళ్ళు ఆవేశంతో ముడుచుకుపోయాయి. అతని శరీరంలోని రక్తం ప్రతీకారంతో వేడెక్కిపోయింది. "ఎస్... ఇతను ఆఫీసర్ రాజయ్యే తన జీవితాన్ని అనుక్షణం శాసించి, అష్టకష్టాలు పడేట్లు చేసినవాడు. ఇన్ని రోజులకు ఇతను తనచేతిలో చిక్కడం నిజంగానే వండర్. దేవుడివంటే నువ్వేనయ్యా. ఎంత విచిత్రంగా, ఎంత నాటకీయంగా నా విరోధిని, నా ప్రత్యర్థిని నీ కసితీర్చుకోరా అని నా చేతుల్లో వుంచావు. హేట్సాఫ్ టు యు మై గాడ్!"

రాజయ్యకు కూడా ఆఫీసర్‌ను ఎక్కడో చూసినట్లనిపించింది కాని ఎక్కడ చూశాడో గుర్తురాలేదు. కాని ఆఫీసర్‌లో క్షణక్షణానికి వస్తున్న మార్పులు, కోపం వచ్చినప్పుడు ఆ పళ్ళు కొరకడం, ఆ నుదురు ముడవడము వినూత్నంగా ఉండడంతో అతనికి ఆఫీసర్ ఎవరో చప్పున గుర్తుకొచ్చింది.

అంతే! అతనికి తల గిర్రున తిరుగుతున్నట్లయింది పైన తిరుగుతున్న సీలింగుఫాను పైన గాక తన మెదడులోనే స్పీడుగా తిరుగుతున్నట్లయింది. రక్తప్రసారానికి కేంద్రమైన గుండె రక్తప్రసరణ వేగానికి ఇప్పుడో, ఇంకొంచెం సేపట్లోనో ఆగిపోయేట్లుగా ఉంది.

"నీవు...నీవు...మీరు...మీరు రామారావు కదూ?"

"అవునండీ ధర్మప్రభువులయిన రాజయ్యగారూ! ఒకప్పుడు విజయవాడలో మీ దగ్గర గుమస్తాగా పని చేసినవాణ్ణి. మీ కిరాతకచర్య

ఫలితంగా నాకు ఒకే ఒక్క దిక్కయిన కన్న తండ్రిని కడచూపు లేకుండా పోగొట్టుకొన్న దౌర్భాగ్యుణ్ని. నాకు అత్యంత ప్రేమపాత్రు డయిన తండ్రిని పొట్టన బెట్టుకొన్న నిన్ను ఈ జన్మకు మరచిపోగలనా రాజయ్యా?"

ఆఫీసరు వ్యంగ్య భాషణకు రాజయ్యకు మతి స్థిమితం తప్పింది. భూమి రెండుగా చీలి తనను మింగేస్తే ఎంత బాగుండును–అనుకొన్నాడు. ఆఫీసరు ఎంతో మంచివాడనీ, ఎంతో కాలంగా పెండింగ్ పడి వున్న పనులు అతి సునాయాసంగా పరిష్కరిస్తున్నాడనీ ఎంతో ఆశతో వచ్చాడు. కాని విధి ఇలా ఎదురుతిరుగుతుందని తను ఊహించలేదు. తన పెన్షను ఇప్పుడు కాదు సరికదా, శాశ్వతంగా రాకుండా చేస్తాడు. ఆయనకు నవ నాడులూ క్రుంగిపోయాయి.

"నేను వెళ్తాను సార్!" అంటూ వెనుదిరిగాడు రాజయ్య.

"మంచిది." ముక్తసరిగా జవాబిచ్చాడు రామారావు.

కారే కన్నీటిని తుడుచుకొనే ప్రయత్నం కూడా చేయకుండా బయటికి నడిచాడు.

ఇంతకాలం తనకు పని కాలేదని కడుపుమండిన రాజయ్య ఆవే శంతో ఆఫీసర్ని తిట్టి ఉంటాడనీ, కోపమొచ్చిన ఆఫీసరు బాగా బుద్ధి చెప్పి ఉంటాడనీ, దాంతో రాజయ్య ఇలా బయటికొచ్చాడనీ భావించాడు బంట్రోతు.

* * * *

బెల్ శబ్దం విని "అయ్యా" అంటూ లోపలికెళ్ళాడు బంట్రోతు.

"తలనొప్పిగా వుంది. టాబ్లెట్ తీసుకురా" అంటూ జేబులోంచి రూపాయ నోటు తీసిచ్చాడు ఆఫీసరు.

పది నిముషాల్లో టాబ్లెట్‌తో సహా తిరిగి వచ్చి, అది ఆయనకు అందించి, ప్లాస్కులోని కాఫీ కప్పులోకి పంచి దాన్ని టేబులు మీద పెట్టాడు.

టాబ్లెట్ వేసుకొని కాఫీతాగి కుర్చీలో రిలాక్సింగ్‌గా వాలిపోయాడు. అయినా అతన్ని గత ఆలోచనలు వెంటాడడం మానలేదు.

నరసయ్యకు ఇద్దరు కుమార్తెల అనంతరం ఆఖరివాడు రామారావు రామారావు పుట్టిన రెండేళ్ళకు అతని తల్లి చనిపోయింది. తరువాత నరసయ్య మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా తనే ఎంతో శ్రమకోర్చి ఇద్దరు కుమార్తెల వివాహం చేశాడు. ఆడపిల్లలకు చదువు చెప్పించకపోయినా రామారావుని మాత్రం గ్రాడ్యుయేట్ చేశాడు.

అప్పటికే అతను ఆర్థికంగా బాగా చితికిపోయాడు. చిన్న పెంకుటిల్లు తప్ప ఉన్న కొద్ది పొలం అమ్మేశాడు. దాంతో బ్రతకడానికి వారికి ఏ ఆధారమూ లేకుండా పోయింది. నరసయ్య శక్తి ఉడిగి ఏ పనీ చేయలేకపోయాడు. రాత్రులు ఒకటే దగ్గు రామారావు ఏం చేయగలడు? తండ్రి చేసిన త్యాగానికి అతనికి ఎంతో కృతజ్ఞత ఉంది.

అయితే తండ్రీ కొడుకుల అదృష్టం బాగుండి రామారావుకి ఒక గవర్నమెంటు ఆఫీసులో ఉద్యోగం దొరికింది. అదీ స్వంత ఊళ్ళోనే. తండ్రీ కొడుకుల ఆనందానికి అంతులేదు.

రామారావు ఆ రోజు జాయినింగు రిపోర్టు ఇచ్చి ఉద్యోగంలో చేరాడు. ఎంతో సిన్సియర్‌గా పని చేయసాగాడు.

పది రోజులు గడిచిన తరువాత ఆ రోజు ఆఫీసరు దగ్గరి నుంచి పిలుపు వచ్చింది.

"ఏమోయ్, నువ్వు సరిగా పనిచేయడంలేదని తెలిసింది."

"సార్ నేను కష్టపడి పని చేస్తున్నాను. నేనెంత వర్కు టర్నో వరు చేస్తున్నానో రోజూ మీకు ప్రోగ్రెస్ పంపించమంటే పంపిస్తాను" నమ్మకంగా అన్నాడు రామారావు.

"అంత దూరం వద్దు గాని, వినయ విధేయతలు నేర్చుకో. కొత్తగా వచ్చిన వాడివి. అంతలోనే ఎక్స్‌పర్టువి కాలేవు గాని, తెలియనివి మళ మేనేజరు నడిగి చెప్పించుకొని చేయి" అన్నాడు ఏదో ఉదారబుద్ధి చూపిస్తు న్నట్లు.

"అలాగే సార్" అంటూ బయటికి వచ్చేశాడు. తరువాత అర్థం కాని ఫైళ్ళు తీసుకొని మేనేజరు దగ్గరకు వెళ్ళాడు.

మేనేజరు అతన్ని ఎగాదిగా చూసి—"ఎందుకోయ్ అంత తొందర? రేపు చెబుతాను గాని, ఈ రోజుకి నీకు అర్థమయిన ఫైళ్ళు రాయి" అన్నాడు ముఖాన చిరునవ్వు పులుముకొని.

ఆ రోజు సాయంత్రం ఆఫీసు కాగానే బయలుదేరుతున్న రామా రావుని "ఉండవోయ్. పది నిముషాల్లో నేనూ వస్తాను. వెళదాము" అన్నాడు మేనేజరు.

పది నిముషాల తరువాత ఇద్దరూ కలసి బయలుదేరారు.

"రామారావ్. నీకు వర్కంతా నేర్పిస్తానోయ్. అయితే నేను చెప్పినట్లు వినాలి."

"అలాగేనండీ."

"ఈ రోజుల్లో ఏ పనికీ బంట్రోతుల్ని నమ్మడానికి లేదోయ్. డబ్బు లిచ్చి పంపామనుకో. రూపాయకి వస్తువు తెచ్చి రెండు రూపాయలు ధర చెబుతారు."

"మిమ్మల్ని మన ఆఫీసు బంట్రోతులు మోసం చేస్తారా?"

"నిజంగానే నువ్వు అమాయకుడవయ్యా. అది సరేగాని, రేపటున్నుంచి నాకు కొన్ని పనులు నువ్వు చేసిపెట్టాలయ్యా!"

"చెప్పండి సార్."

"ఉదయాన్నే మార్కెట్‌కి వెళ్ళి కూరగాయలు తెచ్చివ్వాలి. మా ఆవిడ జబ్బు మనిషోయ్. కొద్దిగా నీళ్ళు తోడిపెట్టాలి. తరువాత మా పిల్లల్ని కాన్వెంటు దగ్గర వదలి రావాలి."

రామారావుకి కడుపు మండిపోయింది. తను ప్రభుత్వపు పని చేస్తున్నాడు కాబట్టి జీతం ఇస్తున్నారు. అలాంటిది తను అతని యింట్లో ఎందుకు పనిచేయాలి ఛ...ఎంత హీనంగా ఆలోచించాడు తనను గురించి మనసులోనే ఉడికిపోయాడు రామారావు.

కాని తన ఆవేశం బయటపడనీకుండా "సారీ సార్. అది నాకు వీలుకాదు" అన్నాడు.

మేనేజరు ముఖం కోపంతో ఎర్రగా మారిపోయింది. "ఆల్‌రైట్. ఇక నువ్వెళ్ళు" అన్నాడు నడుస్తున్న వాడల్లా ఆగి.

మరుసటి రోజు నుంచే రామారావుకి కష్టాలు ప్రారంభమయ్యాయి. మేనేజరు ప్రతి చిన్న విషయానికి ఎగిరిపడడం మొదలుపెట్టాడు. కారణం అర్థమయ్యేది కాదు రామారావుకి.

రామారావు బాగా ఆలోచించి మేనేజరు తనకు చెప్పినట్లే మిగతా గుమస్తాలకు కూడా పనిచెబుతాడని అని ఆరాతీశాడు. కాని మేనేజరు తమతో చాలా మర్యాదగా మాట్లాడుతాడని అందరూ చెప్పారు. నలిగిన నూలు బట్టలతో ఉన్న తన వేషం చూసుకొన్న తరువాత అతనికి అంతా అర్థమయింది. తండ్రి తన చదువుకి, అక్కల పెళ్ళిళ్ళకి చేసిన అప్పులు

తీర్చడంతోనే తన జీతం నెల నెలా సగంపైగా అయిపోతూ వుంది. ఇక పోతే తండ్రి జబ్బు, ఈ ఆర్థిక బాధల మధ్య తన బట్టల విషయంలో చాలా ఉదాసీనంగా ఉంటున్నాడు. అదే తను బంట్రోతుల కంటే హీనంగా కనిపించి మేనేజరు చేత అలా అడిగేట్లు చేసింది.

అయినా రామారావు దానికేం బాధపడలేదు. తన ఆర్థిక బాధలు, కష్టాలు ఇతరులకేం తెలుసు—అని సమాధాన పడ్డాడు.

మేనేజరు సతాయింపుల మధ్య ఆరు నెలలు గడిచిపోయాయి. కాని ఇక తను ఈ నస భరించలేననుకొన్నాడు. అందుకే ఒక రోజు ఆఫీసరుకు రిపోర్టు చేశాడు రామారావు.

"అయితే ఏమంటావు రామారావ్? మేనేజరు చెడ్డవాడని, నువ్వు మంచివాడివని అంటావ్. మేనేజర్ని తగువిధంగా శిక్షించా లంటావ్, అంతేగదా?" అన్నాడు ఆఫీసరు రాజయ్య.

"ఆయన్ని శిక్షించమని నే నడగడంలేదు సార్. ఒకసారి పిలిచి మందలించండి."

"అలాగే చేస్తాగాని, రాత్రి కొకసారి మా యింటికి రావోయ్, నీతో పనుంది."

"అలాగేసార్" అంటూ అక్కడనుంచి బయటికొచ్చేశాడు రామారావు.

తరువాత ఆఫీసరు మేనేజర్ని లోపలికి పిలిచాడు. లోపలికెళ్ళిన మేనేజర్ అంరగంట తరవాత ముఖాన గంటు పెట్టుకొని వచ్చాడు. రామారావుకి ఆఫీసర్ మీద గౌరవం హెచ్చింది.

ఆ రాత్రి ఆఫీసరు ఇంటికెళ్ళిన రామ రావు ఆఫీసర్ చెప్పిన పని విని కొయ్యబారిపోయాడు.

"ఇది నా ఇల్లు కాదోయ్. నా ఫ్రెండు ఇల్లు. బార్‌కి వెళ్ళి రెండు బీరు, హోటల్లో ఒక చికెన్ ఫ్రై పట్టుకురా. మన ఆఫీసు అటెండర్లయితే ఊరంతా ప్రచారం చేస్తారు. ఈరోజునుంచి నువ్వే ఈ పనులు చెయ్యాలోయ్. కాదనవుగా?" అన్నాడు.

అంతే! రామారావుకి అరికాలిమంట నెత్తికెక్కింది. "ఏమిటి మీ ఉద్దేశ్యం? నేను మీకు అటెండరుకంటే హీనంగా కనిపిస్తున్నానా? ఐనా అటెండరు మాత్రం జీతం తీసుకొని ఆఫీసులో పనిచెయ్యాలిగాని, మీ స్వంత పని చెయ్యాలనుందా?" అంటూ ఆవేశంగా అరిచాడు రామారావు.

దాంతో రాజయ్య ఉగ్రుడైపోయాడు. "డోంటాక్ నాన్సెన్స్! గెటౌట్ ఫ్రం హియర్ ఎట్ ఒన్స్" అంటూ వీధి వైపు వేలు చూపించాడు.

రోడ్డెక్కాడు రామారావు. 'ఛ...ఛ...బీదరికం ఎంత అమానుషమైనది అనుకోంటూ తన దరిద్రాన్ని తిట్టుకొంటూ ఇంటిముఖం పట్టాడు.

రోజులు గడిచిపోతున్నాయి. ఇప్పుడు మేనేజర్ సతాయింపులకు తోడు, ఆఫీసర్ సతాయింపులు కూడా ఎక్కువయ్యాయి. మేనేజర్ చెప్పే ప్రతీ చాడీని ఆఫీసరు నమ్ముతున్నాడు.

ఇలా ఇద్దరూ ఒకటై రామారావును సాధించడం మొదలుపెట్టారు.

మరుసటిరోజు హైద్రాబాద్‌లోని హెడ్ ఆఫీసుకు కాన్ఫరెన్స్ పర్టిక్యులర్స్ పోవలసి ఉంది. అందుకే పగలంతా క్షణం తీరిక లేకుండా చేసినా పనికాలేదు. ఆఫీసులోని అన్ని సీట్లకంటే రామారావు సీటు హెవీ సీటు. ఫైళ్ళు ఎక్కువ.

రాత్రి పదయ్యేసరికి ఒక్కొక్కరే ఇళ్ళకు పోతున్నారు. రామారావు కూడా బయలుదేరడానికి ఉద్యుక్తుడయ్యాడు. పని పూర్తిచేసి పొమ్మన్నాడు మేనేజర్. ఉదయం అందరికంటే ముందొచ్చి, ఎనిమిది గంటలకల్లా రిపోర్టు అందిస్తానన్నాడు రామారావు. మేనేజర్ ఒప్పుకోలేదు.

రామారావుకి జబ్బుతో ఉన్న తండ్రి పదేపదే గుర్తుకు వస్తున్నాడు.

ఇంతలో ఫోన్ మోగింది. ఫోన్ అందుకొన్న మేనేజర్ "ఎవరో నువ్వు కావాలని అడుగుతున్నారు" అంటూ రిసీవర్ ఇచ్చాడు.

విషయం విన్న రామారావు "సార్! మా నాన్నకు సీరియస్‌గా ఉందట. రెండుసార్లు రక్తం కక్కుకున్నాడట. నేరు వెళ్ళాలి" అన్నాడు దీనంగా.

"నేనెవర్నయ్యా నీకు పర్మిషన్ ఇవ్వడానికి? ఆఫీసర్‌కు చెప్పి వెళ్ళు" అన్నాడు.

రామారావు ఆఫీసర్ గదిలోకి వెళ్ళేసరికి ఆయన కునికిపాట్లు పడుతున్నాడు. రామారావు గట్టిగా పిలిచేసరికి కళ్ళు తెరిచాడు.

విషయమంతా విని "ఐతే ఏమంటావు? ఇంటికి వెళతానంటావు. ఇంటి దగ్గర మీ తండ్రిని హాస్పిటల్‌కు తీసుకుపోయి చూపిస్తుంటే ఇక్కడ నీ పనెవరు చేస్తారు? ఇంకొకడికి ఆ సబ్జెక్టు అర్థంకాదే. అయినా నీకు ఉద్యోగం ముఖ్యమా? తండ్రి ముఖ్యమా?" అంటూ ప్రశ్నించాడు.

ఇలా అడుగుతాడని ఏమాత్రం ఊహించని రామారావు స్టన్ అయ్యాడు. నిజానికి తనకు రెండూ ముఖ్యమే. ఒకటి జన్మనిచ్చిన కన్న తండ్రి, ఇంకొకటి తమ రెండు శరీరాలను పోషించే ఉద్యోగం. ఒకటి భూతకాలంలో తన ప్రేమానుభూతుల్ని పంచిచ్చి ఇంతవాణ్ని చేస్తే—

రెండోది వర్తమాన కాలంలో తనకు బ్రతికే ధైర్యాన్ని ఇస్తోంది రామారావు ఒక నిర్ణయానికి వచ్చి—

"సార్! నాకు రెండూ ముఖ్యమే. ఈసారికి నా సీట్లో పని ఎవరి కయినా అప్పజెప్పి చేయించుకోండి సార్!" అన్నాడు రెండు చేతులెత్తి నమస్కరిస్తూ.

"నీమీద నాకంత ఇంట్రెస్టు ఏమీలేదు. ఉద్యోగం నిలుపుకోవా లనుకుంటే ఎంత పొద్దుపోయినా పని పూర్తిచేసుకొని వెళ్ళు. లేదనుకుంటే వెంటనే వెళ్ళి నీ తండ్రిని చూసుకో" ఖచ్చితంగా చెప్పాడు ఆఫీసర్ రాజయ్య.

బయటికొచ్చిన రామారావుని తండ్రిమీద అభిమానం ఎన్నో రెట్లు ఎక్కువ ఉన్నా ఉద్యోగం వదులుకోవడం ఇష్టంలేదు. ఆ ఉద్యోగం ఉంటేనే కదా తను, తన తండ్రి ఈమాత్రం బ్రతుకుతున్నారు! అందుకే పని పూర్తిచేయటానికి నిర్ణయించుకున్నాడు.

వచ్చి సీట్లో కూర్చున్నాడేగాని పని జరగడంలేదు. ఎంతసేపటికీ ఆలోచనలు తండ్రి చుట్టూ తిరుగుతున్నాయి. తండ్రి అనారోగ్యమే అత నికి మాటిమాటికీ ఆందోళన కలిగిస్తోంది.

చివరకు సీట్లో కూర్చోలేక ఉద్యోగం పోతే పోయిందని ఇంటికి బయలుదేరాడు.

ఇంటికెళ్ళేసరికి అంతా ఐపోయింది. తననింతవాణ్ని చేసిన తండ్రిని రక్షించలేకపోయాను కదా అని ఘోరున ఏడ్చాడు రామారావు.

తరవాత అతను ఆఫీసు పని మధ్యలో వదిలిపెట్టి వెళ్ళాడనీ,

అందుకు సంజాయిషీ చెప్పాలనీ మరుసటిరోజు మెమో పంపించాడు ఆఫీసర్.

అంతే! ఉగ్రుడయిన రామారావు ఆఫీసుకు వెళ్ళి ఆఫీసర్ని చెడా మడా తిట్టి, ఆఫీసర్ టేబుల్ మీద రాజీనామా ఉత్తరం పడేసి వచ్చాడు.

తరవాత తండ్రి జ్ఞాపకాలతో, నిరుద్యోగంతో రెండు సంవత్సరాలు గడిపిన రామారావు, ఆఫీసర్ పరీక్షలో పాసయి మళ్ళీ అదే డిపార్ట్ మెంటులో ఆఫీసర్‌గా చేరి ప్రస్తుతం ఇక్కడికి బదిలీ అయ్యాడు.

* * * *

రాజయ్య కళ్ళు మూసినా, తెరిచినా రామారావు ఆనాటి రూపమే కళ్ళముందు కదలాడుతూ ఉంది. తండ్రి చనిపోయిన తరవాత తనిచ్చిన మెమోకి జవాబుగా అతనే తన దగ్గరకొచ్చాడు.

"సార్! మీరు అధికారముంది కదాని నా జీవితంతో ఆటలాడుకొన్నారు. నాకు ఒక్కగానొక్క దిక్కు నా తండ్రి. మీ దుశ్చర్యలవల్ల నేనాయన్ని పోగొట్టుకున్నాను. నా కష్టాలు, కన్నీళ్ళు మిమ్మల్ని ఏనాటికయినా వెన్నాడక మానవు"

ఆనాడు రామారావు కళ్ళలో కనిపించిన క్రోధం, పేగులు తెంచుకొని అతను మాట్లాడిన ఒక్కొక్క మాటా రాజయ్యకు ఇప్పటికీ చెవుల్లో శంఖం ఊదినట్లు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

అవతలివాడి కష్టసుఖాలు తెలియకుండా కన్నుమిన్ను గానక తను ఆనాడు అలా ప్రవర్తించబట్టే ఈనాడు దేవుడు తనకు ఇన్ని కష్టాలు పెట్టాడు. ఇది న్యాయం, ధర్మం" గొణుక్కున్నాడు రాజయ్య.

రాజయ్య ఏదేదో తనలో తాను మాట్లాడుకోవటం అతని భార్యకు కూతుళ్ళకు అమితమయిన ఆందోళన కలిగిస్తోంది.

కాని రామారావు తననుకొన్నంత చెడ్డవాడు కాదనీ, కష్టాల్లోంచి పైకి వచ్చినవారికి ఇతరుల కష్టాలు తెలుసుననీ, అటువంటి వాడి పురోభివృద్ధికి ఎంతమంది అడ్డుకొన్నా ధర్మమనే చక్రం వీటన్నిటిని ఛేదించి అతన్ని వెలుగులోకి తెస్తుందనీ, అలా వెలుగులోకి వచ్చినవాడు అందరికీ తన వెలుగుల్ని పంచుతాడనడానికి గుర్తుగా ఇది జరిగిన పదిహేను రోజులను పెన్షను శాంక్షనయిన ఉత్తర్వులు రాజయ్యకు చేరాయి.

రాజయ్య అటు వెళ్ళగానే చెడ్డవాడికి మంచి చెయ్యాలనే మనస్తత్వంగల రామారావు కనక్టెడ్ ఫైలు తెప్పించి క్షుణ్ణంగా చదివి హెడ్ ఆఫీసుకు డిటెయిల్డు రిపోర్టు రాసి పెన్షన్ శాంక్షన్ చేయించాడు.

భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సంవత్సరానికొకసారి సూర్యుని చుట్టూ తిరగక తప్పదు. ఎందుకంటే సూర్యుడు స్వయం ప్రకాశం గలవాడు. అందుకే కాబోలు ప్రతి సంవత్సరం మొదటి తేదీన ప్రత్యేకంగా రామారావుని గుర్తు తెచ్చుకొంటాడు రాజయ్య.

*